## క్లుప్తంగా

### సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పాల్గుణ మాసం మంగళవారం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్న సమారాధన చేశారు.

### చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి


కొంకుదురులో విద్యార్థులకు క్రీడా దుస్తులు అందిస్తున్న సర్పంచ్ సత్తి వీరమణి

బిక్కవోలు: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. ఆమె తన సొంత నిధులతో సమకూర్చిన క్రీడా దుస్తులను, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సమకూర్చిన నోటు పుస్తకాలను కొంకుదురు ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరమణి మాట్లాడుతూ క్రీడల ద్వారా ఉన్నత స్థానాలకు ఎదిగినవారిని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న వైద్యాధికారి సురేఖ

పెదపూడి: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని కాకినాడ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీకి చెందిన ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ బి.సురేఖ అన్నారు. పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో గర్భిణులు, బాలింతలు, శిశువులు, స్కూల్ విద్యార్థుల ఆరోగ్య వివరాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ సురేఖ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు సంబంధించిన వైద్య పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఆరోగ్య కేంద్రాల నుంచి అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యురాలు ప్రత్యూష, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవం


గర్భిణికి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

సీతానగరం: చినకొండేపూడి అంగన్‌వాడీ సెంటర్-2లో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆ గ్రామంలోని ఏడు అంగన్‌వాడీ సెంటర్లు కలిసి పోషన్ అభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ పెదలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపారు. ముందుగా కోనె విమల అనే గర్భిణికి సీమంతం చేశారు. తక్కువ ఖర్చుతో పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తయారు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుభాషిణి, రాణి, మంగా కుమారి, సునీత, శాంతి, సీత, ధనలక్ష్మి, ఏఎన్ఎమ్ కృష్ణవేణి, ఏఎఫ్ అనిత పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షకు 27 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. 679 మంది హాజరు కావాల్సి ఉండగా 652 మంది విద్యార్థులే పరీక్ష రాశారన్నారు.

### రైలు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు గుర్తించి సమాచారమివ్వడంతో రైల్వే అధికారులు క్షతగాత్రుడిని పెదపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

# మళ్లీ విజయఢంకా మోగిద్దాం

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- సంబరాలు చేసుకున్న పార్టీ శ్రేణులు


అనపర్తిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి


రామవరంలో కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ విజయఢంకా మోగించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేద్దామని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రామవరంలో జరిగిన కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్తి రామకృష్ణారెడ్డిలు పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2011లో జిల్లాలో ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీ సుదీర్ఘ ప్రజా ప్రస్థానంలో ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగుతోందన్నారు. విలువలు, విశ్వసనీయతకు పట్టం కడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో దేశ చరిత్రలో లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ మరెన్నో చారిత్రాత్మక విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అనపర్తి, రామవరం సర్పంచ్‌లు వారా కుమారి, గిరడా గంగాభవాని, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్లు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, మేడపాటి వాసు, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, బండారు శ్రీనివాసరావు, కొండేటి భీమేష్, పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు విజయకుమారి, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, వాసంశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పేదలకు అండగా వైఎస్సార్ సీపీ జెండా ఉంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ అన్నారు. మంగళవారం పందలపాకలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పాజీ మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆనందంగా జీవిస్తున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలోని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కిలపర్తి సత్యనారాయణ, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గండి వాసు, సొసైటీ డైరెక్టర్ పడాల వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, కొంకుదురు పీహెచ్‌సీ కమిటీ సభ్యుడు యాసలపు శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ కర్రి ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాజానగరం మండలంలో..**

రాజనగరం: ప్రజల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. రాజానగరం మండలం కలవచర్లలో రూ.65 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్‌కు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఇదే ప్రాంగణంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆశయాల కోసం ఆవిర్భవించిన పార్టీ 14వ సంవత్సరంలోకి అడుగిడిందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న, గుర్రాల జోత్స్న, మండల కన్వీనర్లు దూలం పెద్ద, గంటా శ్రీనివాస్, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అనాథ సాయిరాం, గండి నాని బాబు, కోలపాటి వెంకన్న, దాట్ల రఘువరరామ, అడపా బాబు, దాట్ల రఘు పాల్గొన్నారు.

**కోరుకొండ మండలంలో..**

మధురపూడి: కోరుకొండ మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావం దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దోసకాయలపల్లిలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి నిరంతరం పోరాటం చేస్తున్న పార్టీ అన్నారు. కాపవరంలో పసుపులేటి బుల్లియ్య నాయుడు, గొల్లపల్లి ప్రవీణ్, సీరుకొండ బాబ్జీ, కటకం బాబ్జీ, బొండాడ చందు ఆధ్వర్యంలో, బూరుగుపూడిలో వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్ తేజ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు జరిగాయి. గాదరాడ, గాడాల, నిడిగట్ల తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు కొండపల్లి దుర్గారావు, కడవల శివ, పిట్టా కృష్ణ, కోటికేశవరం సర్పంచ్ ముడే సింధూదివ్య పాల్గొన్నారు.

**సీతానగరం మండలంలో..**

సీతానగరం: మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, మదర్‌థెరిస్సా విగ్రహాలకు సేవాదళ్ జిల్లా అధ్యక్షుడ డాక్టర్ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు ఘంటా శ్రీనువాస్, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాబు, సర్పంచ్‌లు కోండ్రపు ముత్యాలు, చెరుకూరి శ్రీనివాస్ తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు, ముదునూరి రామకృష్ణంరాజు, కాండ్రు వీరన్న, సలాది వాసు, ద్వారంపూడి రామకృష్ణ, కోలా శ్రీను, మద్దాల కొండలరావు పాల్గొన్నారు. కాటవరంలో పార్టీ కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు ఆధ్వర్యంలో జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేశారు. ఎంపీటీసీ తాడిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ కోన రామకృష్ణ పాల్గొన్నారు.


బూరుగుపూడిలో వేడుకలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


సీతానగరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు


పందలపాకలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద పార్టీ జెండాను ఎగురవేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

# సంక్షేమ సారథి సీఎం జగన్


వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రంగంపేటలో టీడీపీకి చెందిన దేవపాటి అర్జున, దేవపాటి సూరిబాబు, దేవపాటి ఏసుబాబు, మెంతుకూర గోవిందు, కొటాల శాల్మన్‌రాజు, కలపరెడ్డి కోటేశ్వరరావు, శీలం వీరబాబు, ప్రగడ దుర్గాప్రసాద్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అర్హులందరికీ అందించారన్నారు. టీడీపీ హయాంలో ఇటువంటిది ఒక్క పథకమైనా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లకు చెందిన బట్టు రవిచంద్ర, బట్టు చందులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.3 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందజేశారు. రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ముగ్గళ్లకు చెందిన భార్యాభర్తలు బట్టు హనుమంతు, కాంతం అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుమారులు ఎనిమిదేళ్ల రవిచంద్ర, ఏడేళ్ల చందు, సంరక్షకుడు జక్కల అంజనా కుమార్‌లకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చెక్కులను అందించారు.

రాజానగరం: ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం కలవచర్ల ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అదే ప్రాంగణంలో రాజానగరం నియోజకవర్గంలోని 45 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.26.16 లక్షల చెక్కులను అందజేశారు.

### గ్లకోమా వ్యాధిపై అవగాహన ర్యాలీ


బొబ్బిల్లంకలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: బొబ్బిల్లంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏసురాణి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ సిబ్బంది మంగళవారం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ కంటిలో శుక్లాలు వచ్చినవారు సకాలంలో క్యాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోవాలన్నారు. అశ్రద్ధ చేస్తే అది గ్లకోమాగా పరిణమించి, శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణుడు సత్యప్రసాద్, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

### పిరమిడ్ ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు శివరామకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆరో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ ధ్యాన కేంద్రం గురువు నల్లమిల్లి అన్నపూర్ణ మాట్లాడుతూ రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అవకాశమున్న సమయంలో ధ్యానం చేయాలన్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

### లేపాక్షిలో క్లియరెన్స్ సేల్స్‌పై డిస్కౌంట్

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియంలో ఎంపిక చేయబడిన వస్తువులపై 10 శాతం నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్టు రాజమహేంద్రవరం శాఖ మేనేజర్ జి.మోనిక అన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని లేపాక్షి ఎంపోరియంలో వాణిజ్య సంవత్సరం ముగింపు సందర్భంగా ఎంపిక చేసిన హస్తకళ వస్తువులు, చేనేత వస్తువులపై డిస్కౌంట్ ప్రకటించారు. మోనిక మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.విశ్వ, ఓఎస్డీ ఐవీ లక్ష్మీనాథ్ ఆదేశాల ప్రకారం మార్చి ఎండింగ్ క్లియరెన్స్ సేల్స్ ప్రారంభించామన్నారు. ఇవి ఈనెల 31వ తేదీ వరకూ ఉంటుందన్నారు. లేపాక్షి ఎంపోరియంలో వివిధ రకాల హస్తకళ, చేనేత వస్తువులు అందుబాటులో ఉన్నాయని, వాటికి యథాతథంగా పదిశాతం డిస్కౌంట్ ఉంటుందన్నారు.

# ప్రజల గుండెల్లో వైఎస్సార్‌కు సుస్థిర స్థానం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

రంగంపేట: మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి ప్రజల గుండెల్లో ఎప్పటికీ సుస్థిర స్థానం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట దేవిగుడి సెంటర్ వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహానేత విగ్రహాన్ని మంగళవారం రాత్రి రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ అభివృద్ధికి నడక నేర్పించడమే కాకుండా ప్రతిక్షణం పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాల మారాజుగా నిలిచిపోయారన్నారు. మహానేత తన ఐదేళ్ల మూడు నెలల అద్భుత పాలనలో ప్రజా హృదయాల్లో చెరగని ముద్ర వేశారని చెప్పారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో ఎప్పుడూ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ కనీవినీ ఊహించని సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారన్నారు. శత్రువును సైతం ప్రేమించే గుణం వైఎస్సార్‌దన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులి వీర్రాజు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో అధిక ప్రసవాలు జరిగేలా చూడాలి

డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి

అనపర్తి: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఏరియా ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా వైద్యులు, సిబ్బంది దృష్టిసారించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రి పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలతో స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ సనత్‌కుమారి మాట్లాడుతూ అనపర్తి ఏరియా ఆసుపత్రిలో సకల మౌలిక వసతులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు సంబంధిత వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నారన్నారు. లక్షలాది రూపాయలు విలువైన వివిధ వైద్య పరికరాలు, రక్త పరీక్షలకు సంబంధించిన ల్యాబ్ అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే ఆశించిన స్థాయిలో ఏరియా ఆసుపత్రిలో ప్రసవాలు జరగకపోవడంతో కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకుని అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ తరుణ్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### గీతాంజలిది ముమ్మాటికీ హత్యే


కొండపల్లి సుబ్బలక్ష్మి

మధురపూడి: తెనాలికి చెందిన గీతాంజలిని సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన మూకలు వేధించి చంపాయని, వారిని వెంటనే అరెస్టు చేయాలని రాష్ట్ర హిస్టరీ ఎకాడమీ డైరెక్టర్ కొండపల్లి సుబ్బలక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం గాడాలలో విలేకరులతో మాట్లాడారు. గీతాంజలిది ముమ్మాటికీ హత్యే అన్నారు. జగనన్న అమలు చేస్తున్న అమ్మఒడి, చేయూత, ఆసరా, పింఛన్లతో తన కుటుంబం బాగుపడిందని యూట్యూబ్ చానల్‌కు సంతోషంగా చెప్పడమే ఆమె చేసిన పాపమా అన్ని ప్రశ్నించారు. తీవ్ర మనస్తాపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న గీతాంజలికి న్యాయం జరగాలన్నారు.

### ఇఫ్కో జోనల్ డైరెక్టర్‌గా బులి వీర్రాజు


బులి వీర్రాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: రంగంపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు పోతుల బులి వీర్రాజుకు ఇఫ్కో జోనల్ డైరెక్టర్ పదవి లభించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు సోమవారం అందినట్టు ఆయన తెలిపారు. ఇఫ్కో ఎరువుల కర్మాగార సంస్థ దేశవ్యాప్తంగా సుమారు 200 మంది సభ్యులు ఉండగా, ఐదు జిల్లాలకు సంబంధించి జోనల్ డైరెక్టర్‌గా బులివీర్రాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆశీస్సులతో ఈ పదవి వరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, స్థానిక సొసైటీ సిబ్బంది, డీసీసీబీ బ్యాంకు సిబ్బంది, మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

### సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు


బూరుగుపూడిలో సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు

మధురపూడి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించుకోవాలంటూ సీఆర్‌పీఎఫ్ పోలీసులు మంగళవారం మధురపూడి, బూరుగుపూడి, గుమ్ములూరు, దోసకాయలపల్లి, నిడిగట్ల గ్రామాల్లో కవాతు నిర్వహించారు. కోరుకొండ సీఐ అడపా నాగమురళి, ఎస్సై ఆనంద కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.